సాక్షి
వికారాబాద్

శనివారం । 28 । అక్టోబర్ । 2023



హత్య చేసి..

పండుగ రోజు కన్న తల్లిని హత్య చేసిన ఘటన బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. 2లో▸



కుసుమకు ఆదరణ కరువు

తక్కువ పెట్టుబడి, కనీస నీటి వసతి, అధిక లాభాలు వచ్చే కుసుమ పంటకు ఆదరణ కరువవుతోంది. 3లో▸



పోటాపోటీ చేరికలు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేతలు చేరికలను ప్రోత్సహిస్తున్నారు. 3లో▸

న్యూస్‌రీల్

అండగా ఉంటా ఆశీర్వదించండి

తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు రూరల్: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో మాజీ ఎంపీపీ శరణు బసప్ప, ఎంపీటీసీ రాజ్‌కుమార్‌లను ఆయన కలిశారు. తన వెంట వస్తే అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కరన్‌కోట్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని తెలిపారు. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొనే పార్టీ ఆరు గ్యారంటీలను ప్రకటించిందని తెలిపారు. అనంతరం చంద్రవంచ శివారులోని మహబూబ్ సుభాని దర్గా ఉత్సవాల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, రాందాస్, వడ్డె శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే

మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ప్రసాద్‌కుమార్

పూడూరు: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎన్కేపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్ రాములు, 150 మంది కార్యకర్తలు, ఆ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు బాలమణి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలు తమ వైపే ఉన్నారని, పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రైతు రుణమాఫీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ ఆరు గ్యారెంటీ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల హామీల అమలులో, ఉద్యోగాల భర్తీలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అజీం పటేల్, రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్, సీతారాములు, అనంతయ్య పాల్గొన్నారు.

అన్నపూర్ణగా తెలంగాణ

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఒకప్పుడు కరువుతో అల్లాడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో అన్నపూర్ణగా మారిందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామని, కేసీఆర్ పాలనలో ఇవి సాకారమయ్యాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతు బీమా పథకాలు తెచ్చి అన్నదాతలకు అండగా నిలిచినట్లు తెలిపారు. సాగునీరు, వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పంటలు పుష్కలంగా పండుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పంట దిగుబడి భారీగా పెరిగిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారన్నారు. ప్రభుత్వ పథకాలు అందని ఇల్లు అంటూ లేదని పేర్కొన్నారు. తనను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కోఆప్షన్ జిల్లా మాజీ సభ్యుడు మీర్ మహమూద్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఈకేవైసీ ఇక్కట్లు



పోస్టాఫీసు వద్ద ఈకేవైసీ కోసం నిరీక్షిస్తున్న చిన్నారులు, పెద్దలు

- సర్వర్ డౌన్‌తో రేషన్ కార్డుదారులు, విద్యార్థులకు ఇబ్బందులు
- పనులు మానుకొని పిల్లల వెంట వస్తున్న తల్లిదండ్రులు
- గంటల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు
- రోజులకు 20మందికే ఈకేవైసీ అవుతున్న వైనం
- సెంటర్లు పెంచాలంటున్న ప్రజలు

వికారాబాద్ అర్బన్: ఆహార భద్రత కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ వారి ఆధార్ నంబర్‌తో ఈకేవైసీ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధన తేవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నెల రోజులుగా ఈ ప్రక్రియ సాగుతున్నా ఆధార్ సెంటర్ల వద్ద రద్దీ తగ్గడం లేదు. ఈకేవైసీ చేసుకునేందుకు కేంద్రం డిసెంబర్ నెల వరకు అవకాశం ఇచ్చింది. సెంటర్ల వద్ద చిన్నారులు, పెద్దలు బారులు తీరుతున్నారు.

కొన్ని బ్యాంకులకే..

ఈకేవైసీ అప్‌డేట్ సెంటర్లను కొన్ని బ్యాంకులకు మాత్రమే పరిమితం చేయడంతో ఇబ్బందులు ఎక్కువైనట్లు ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం పోస్టాఫీస్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐబీఐ, ఒక ఆధార్ సెంటర్‌లో మాత్రమే ఈకేవైసీ చేస్తున్నారు. మండల కేంద్రాల్లో ఈకేవైసీ అప్‌డేట్ సెంటర్లు ఎక్కువగా లేక పోవడంతో అందరూ వికారాబాద్‌కు వస్తున్నారు. దీంతో రద్దీ బాగా పెరిగింది. సర్వర్ డౌన్ ఉండటంతో గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. ఒక్కో సెంటర్‌లో రోజుకు పది నుంచి పదిహేను మందికి మాత్రమే ఈకేవైసీ అవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్కువగా పాఠశాల, కళాశాల స్థాయి పిల్లలకే ఈకేవైసీ లేకపోవడం సమస్యగా మారింది. ఇదిలా ఉండగా రేషన్ షాపుల్లో వారి వేలి ముద్రలు పనిచేయడం లేదు. ప్రభుత్వ ఆదేశం మేరకు ప్రస్తుతం రేషన్ సరుకులు ఇస్తున్నా డిసెంబర్ నెల తరువాత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో పిల్లల తల్లిదండ్రులు వారిని పాఠశాలలు, కళాశాలలకు సెలవు పెట్టించి ఈకేవైసీ చేసుకునేందుకు వస్తున్నారు.

వారం ముందే టోకెన్లు

తరుచూ సర్వర్ డౌన్ అవుతుండటంతో అన్ని సెంటర్ల వద్ద టోకెన్ పద్ధతి ప్రారంభించారు. టోకెన్ తీసుకున్న వారం రోజుల తరువాత ఆధార్ సెంటర్‌కు రావాలని చెబుతుండడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈకేవైసీ చేయడం రేషన్ షాపుల డీలర్లకు అప్పగించినా కొన్ని చోట్ల చేయడం లేదు. కొందరు డీలర్లు చేసేందుకు ముందుకు వస్తున్నా సర్వర్ పనిచేయక పోవడం సమస్యగా మారింది. దసరా సెలవుల సమయంలో సర్వర్ పూర్తిగా పనిచేయక పోవడంతో ప్రస్తుతం రద్దీ ఎక్కువైనట్లు సెంటర్ల నిర్వాహకులు తెలిపారు. పెదలుపనులు మానుకొని పిల్లల వెంట వస్తున్నారు. ఆధార్ సెంటర్లు ఉదయం 10గంటలకు తీస్తారు. అయితే 6గంటలకే క్యూ కడుతున్నారు. ఆపై వచ్చిన వారికి అప్లికేషన్లు ఇవ్వడం లేదు. ఇక చేసేదేమీ లేక ప్రజలు మరుసటి రోజు ఆధార్ సెంటర్లకు వెళుతున్నారు. నిత్యం ఇదే తంతు జరుగుతుండడంతో ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడుతున్నారు.

పనులు మానుకొని వచ్చాం



పొలం పనులు మానుకొని పిల్లలను వికారాబాద్ పోస్టాఫీసుకు తీసుకొచ్చా. టోకెన్ తీసుకొని వారం రోజులు అయ్యింది. సర్వర్ డౌన్ కావడంతో రోజుకు పది మందికే ఈకేవైసీ చేస్తున్నారు.దీంతో పొలం పనులు చేసుకోలేక పోతున్నాం. సెంటర్ల పెంచితే బాగుంటుంది.

– సత్తయ్య, తిమ్మారెడ్డిపల్లి, నవాబుపేట్

ఈకేవైసీ అయ్యాకే హాస్టల్‌కు పోతా



దసరా సెలవుల్లో మా మామ టోకెన్ తీసుకున్నాడు. ఈ రోజు సమయం ఇచ్చారు.పొద్దున వచ్చాం. సర్వర్ డౌన్ ఉండటంతో వేచి చూస్తున్నాం. ఈకేవైసీ పూర్తి చేసుకున్నాకే హాస్టల్‌కు వెళ్లాలి. ఎప్పుడు అయితే అప్పుడు హాస్టల్‌కు పోతా. అక్కడికి వెళ్లాక మళ్లీ పంపరు. స్కూళ్ల వద్ద సెంటర్లు ఏర్పాటు చేయాలి.

– సంపత్, విద్యార్థి, అంతారం, చేవెళ్ల మండలం

బీఎమ్మార్‌కే..

- తాండూరు టికెట్ ఖరారు
- కాంగ్రెస్ రెండో జాబితాలో మనోహర్‌రెడ్డికి అవకాశం
- మద్దతుదారులు, కార్యకర్తల్లో జోష్



వికారాబాద్/తాండూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డికి తాండూరు కాంగ్రెస్ టికెట్ ఖరారైంది. శుక్రవారం పార్టీ రెండో జాబితాలో ఆయనకు చోటు లభించింది. ఇటీవలే ఆయన బీఆర్‌ఎస్ వీడి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. పరిగి నియోజకవర్గానికి చెందిన ఆయన అధికార పార్టీలో ఉంటూనే తన సొంత నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ టికెట్ ఆశించారు. మరోవైపు కాంగ్రెస్ టికెట్ కోసం కూడా ప్రయత్నిస్తూ వచ్చారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో తనకంటూ ఓ వర్గాన్ని తయారు చేసుకున్నారు. పరిగిలో రెండు పార్టీల్లో బలమైన నాయకులు పోటీలో ఉండటంతో అక్కడ టికెట్ రాదని తేలిపోయింది. దీంతో చేసేది లేక తాండూరుపై కన్నేసి.. అనూహ్య రీతిలో హస్తం గూటికి చేరారు. ఆయన ఆ పార్టీలో చేరే నాటికే తాండూరు నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తూ చాలా మంది కాంగ్రెస్ నేతలు దరఖాస్తు చేశారు.

కేఎల్‌ఆర్ మహేశ్వరం వెళ్లడంతో..

తాండూరు కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేసిన మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి అధిష్టానం మహేశ్వరం టికెట్ ఇచ్చింది. దీంతో బీఎమ్మార్ లైన్ క్లియర్ అయింది. మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరింది మొదలు అంతర్గతంగా అనేక అడ్డంకులు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అండదండలతో సమయస్ఫూర్తిగా వ్యవహరించి.. ఒక్కో సమస్యను అధిగమిస్తూ వచ్చారు. చిన్నాచితకా సమస్యలు మినహా పార్టీ కేడర్‌ను ఒకతాటిపైకి తీసుకురావడంలో ఇప్పటికే సఫలీకృతుడయ్యారు. టికెట్ కూడా రావడంతో ఇక కదన రంగంలో పోరాటానికి సిద్ధమయ్యాడు.

మనోహర్‌రెడ్డి ప్రొఫైల్

అభ్యర్థి పేరు: బుయ్యని మనోహర్‌రెడ్డి
పుట్టిన తేదీ : 05 – 08 –1965
స్వస్థలం : తిర్మలాపురం, కుల్కచర్ల మండలం
విద్యార్హత : 10వ తరగతి
రాజకీయ ప్రస్థానం : 1987లో టీడీపీలో యువజన నేతగా చేరిక, 1995లో పరిగి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడిగా.., 1996లో డీసీఎంఎస్ డైరెక్టర్ రంగారెడ్డి జిల్లా, 2006లో కుల్కచర్ల మండల జెడ్పీటీసీగా 5,300 ఓట్ల ఆధిక్యంతో విజయం 2014లో బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా.., 2020లో కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక. ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.
వ్యాపారాలు: జేబీ ఇన్‌ఫ్రా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, బీఎంఆర్ సర్థ కన్వెన్షన్, రియల్ ఎస్టేట్ వ్యాపారం, ప్రైవేట్ హాస్పిటల్స్ రంగంలో రాణిస్తున్నారు.



కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

పరిగి: ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, నీటి వసతి ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది, పోలింగ్ ఏజెంట్ల వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేసేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి సెంటర్ వద్ద మీడియా పాయింట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం స్ట్రాంగ్ రూంను పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశారు. ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీసీ కంట్రోల్ రూమ్, వ్యయ పరిశీలన సెల్, ఎంసీఎంసీ కమిటీల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. వివిధ దిన పత్రికల్లో వస్తున్న ఎన్నికల వార్తలు, ప్రకటనల క్లిప్పింగులను ఎప్పటికప్పుడు పరిశీలించి రికార్డ్ చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్‌ఓ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- పెండింగ్ సమస్యలు పరిష్కరించా
- ప్రతి వార్డుకు రూ. కోటి మంజూరు చేశా
- మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- వార్డుల్లో పాదయాత్ర



తాండూరులో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: పట్టణంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలో పైలెట్ పాదయాత్ర పేరిట శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించారు. మొదట పాత తాండూరులోని శ్రీ కోటేశ్వర ఆలయం, నిజాంషాహీ దర్గాలో ప్రార్థనలు చేసి 14వ వార్డు నుంచి పాదయాత్రను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరిచిన పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా తాండూరు పట్టణం అభివృద్ధికి నోచుకోలేక పోయిందన్నారు. ఈ ఐదేళ్లలో పట్టణ రూపురేఖలు మార్చేశానని అన్నారు. ప్రతి వార్డు అభివృద్ధికి రూ. కోటి చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించినట్లు వివరించారు. వరద నీటితో పలు వార్డుల ప్రజలు ఇబ్బందులు పడేవారని, చిలకవాగు కాలువలకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఆదర్శనగర్‌లో కేసీఆర్ థీమ్ పార్కు, పాత తాండూరులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించామని అన్నారు. మాతా శిశు ఆసుపత్రి, బస్తీ దవాఖానాలతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా చూశానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. అభివృద్ధే లక్ష్యంగా సాగుతున్న తనను ప్రస్తుత ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, రాష్ట్ర నాయకులు కరణం పురుషోత్తంరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సంగీత, వర్కింగ్ ప్రెసిడెంట్ పరిమళ, మాజీ అధ్యక్షురాలు అనురాధ, కౌన్సిలర్లు శోభారాణి, అశ్విని, బాంబిన, ఎమ్మెల్యే సతీమణి ఆర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు



బూచన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

- దేశానికే తెలంగాణ పథకాలు ఆదర్శం
- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- మర్పల్లి మండలంలో ఎన్నికల ప్రచారం

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని కల్‌ఖోడ, శాపూర్, దామస్తాపూర్, దామస్తాపూర్ తండా, బూచన్‌పల్లిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మధుకర్, మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, డీసీసీబీ మాజీ డైరక్టర్ ప్రభాకర్‌గుప్తాతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభంజనంలో కాంగ్రెస్, బీజేపీలు కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ హయాంలో వికారాబాద్ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాతే వికారాబాద్‌కు డిగ్రీ కళాశాల, వైద్య కళాశాల, గురుకుల పాఠశాలలు వచ్చినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను సమానంగా అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ నాయకులు కనిపిస్తారని, ఆ తరువాత వారి జాడే కనిపించదని అన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. రైతు పక్షపాతి కేసీఆర్ అని కొనియాడారు. రైతుబంధు పథకం ద్వారా ప్రతి ఎకరాకు రూ. 10 వేలు ఇస్తున్నట్లు గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లలిత, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మధుకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అశోక్, రమేష్‌మిత్ర, ప్రధాన కార్యదర్శి రాచన్న, యూత్ ప్రసిడెంట్ మధు, ఆయా గ్రామాల సర్పంచులు శివకుమార్, సాలీబియి, జైపాల్‌రెడ్డి, జయ, రైతు బంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న తండా వాసులు

మండలంలోని శాపూర్ తండా వాసులు ఎమ్మెల్యే పర్యటనను అడ్డుకున్నారు. తమ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, రోడ్లు, మురుగు కాలువలు నిర్మించలేదని నిలదీశారు. తండా వాసులను జెడ్పీటీసీ మధుకర్, డీసీసీబీ మాజీ డైరక్టర్ శ్రీకాంత్‌రెడ్డి సముదాయించారు. అనంతరం ప్రచారం ముందుకు సాగింది.

రేవంత్‌ను అనర్హుడిగా ప్రకటించాలి

- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: బీఆర్‌ఎస్ కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేస్తున్న కొడంగల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘానికి ఆధారాలతో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేసి, వారిని పార్టీ మారే విధంగా ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్‌ను పీసీసీ పదవి నుంచి తొలగించాలన్నారు. బీఆర్‌ఎస్ సర్పంచులు, ఎంపీటీసీలను కొనుగోలు చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ సర్పంచులు అమ్ముడుపోరని, నిజాయితీగా గులాబీ జెండా మోసే సైనికులుగా పనిచేస్తున్నారని అన్నారు. తమ పార్టీకి చెందిన ముగ్గురు సర్పంచులను కొనుగోలు చేయడానికి వెళ్లిన రేవంత్ అనుచరుడిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఆయన దగ్గర నుంచి రూ. 5లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తమ పార్టీకి చెందిన గిరిజన సంఘం నాయకులు నర్సింహ్మ నాయక్, శంకర్‌నాయక్, రవినాయక్ నిజాయితీగా ఉండడం వల్లే కాంగ్రెస్ కుట్రలు బయట పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, దేశ్యానాయక్, యాదగిరి, చాంద్‌పాష, నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

క్లుప్తంగా

ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి

అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్



మాట్లాడుతున్న నారాయణ అమిత్

వికారాబాద్ అర్బన్: ఓటు హక్కు అమూల్యమైనదని.. దీనిని ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా వినియోగించుకొని మంచి పాలకులను ఎన్నుకోవాలని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. శుక్రవారం సాయి డెంటల్ కళాశాలలో నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నవంబర్ 30న జరిగే ఓటింగ్‌లో ప్రతీ ఒక్కరు నిజాయితీ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు 18ఏళ్లు నిండినవారంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ఓటు హక్కుపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు మల్లేశం, కోటాజి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరు

ఎమ్మెల్యే ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి: కాంగ్రెస్ నాయకులు ఎన్ని గొడవలు సృష్టించినా బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అనుచరులు గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని గొడవలు చేసినా బీఆర్ఎస్ విజయాన్ని ఆపలేరని అన్నారు. అనంతరం మండలంలోని పంచలింగాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేశం, సీనియర్ నాయకులు బాగయ్య, మహేష్ ఆధ్వర్యంలో 500 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే ఆనంద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు మధు, రాచన్న, అశోక్, గఫార్, గౌస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. తిర్మలాపూర్‌కు చెందిన చింతకాయల వెంకటేశ్(19) అతని స్నేహితుడు కుల్కచర్లకు చెందిన శివ ఈ నెల 21న చాపలగూడెంలో పెయింటింగ్ పనికి వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని శివను కుల్కచర్లలో దింపేందుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో కుల్కచర్ల నుంచి వస్తున్న మరో బైక్ చాపలగూడెం కుంట కట్టపై వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్, శివ తీవ్రగాయాలయ్యాయి. చికిత్స పొందుతున్న వెంకటేశ్ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుని సోదరుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు.



అనంతగిరి: కొత్రెపల్లిలో ప్రచారం చేస్తున్న వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి సబితాఆనంద్

పతుల కోసం సతుల ప్రచారం

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అన్ని పార్టీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్న అభ్యర్థుల సతీమణులు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి తమ పతులను గెలిపించాలని కోరుతున్నారు. శుక్రవారం వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ భార్య సబిత వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్రెపల్లిలో, మోమిన్‌పేట మండలం దుర్గంచెర్వులో, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భార్య ఆర్తిరెడ్డి మంతట్టిలో ప్రచారం చేశారు.

– వికారాబాద్ నెట్‌వర్క్



బషీరాబాద్: మంతట్టిలో ప్రచారం చేస్తున్న తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భార్య ఆర్తిరెడ్డి

గొంతుపై తొక్కి.. గోనె సంచిలో కుక్కి

- కన్న తల్లిని కడతేర్చిన కసాయి
- మృతదేహాన్ని వాగులో పడేసిన కిరాతకుడు
- కాశీంపూర్‌లో ఘటన



అంజమ్మ(ఫైల్)



నిందితుడు వెంకటేశ్

బషీరాబాద్: పండుగ రోజున.. కన్న తల్లిని హత్య చేశాడు ఓ కసాయి కొడుకు. ఈ అమానవీయ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కయ్య అంజమ్మ(55)కు సతీశ్, వెంకటేశ్ ఇద్దరు సంతానం. భర్త మరణానంతరం ఆమె తాండూరులో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. పెద్ద కుమారుడు తాండూరు మండలంలోని ఖాంజాపూర్‌లో నివాసముండగా.. చిన్న కుమారుడు వెంకటేశ్ తాండూరులోని ఓ హోటల్ పనిచేస్తూ తల్లితో కలిసి అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. తాగుడుకు బానిసైన వెంకటేశ్ అప్పులు ఎక్కువ కావడంతో నాలుగు నెలల క్రితం నగరంలో తాపీమేస్త్రీ పనికి వెళ్లాడు. ఈ క్రమంలో అప్పులిచ్చిన వారు తల్లిని నిలదీయడంతో ఆమె తనకు సంబంధం లేదని తన కుమారుడినే అడగాలని సూచిస్తుండేది. ఈ క్రమంలో దసరాకు ఇంటికి వచ్చిన కుమారుడు ఈ నెల 23న అప్పుల విషయమై తల్లితో గొడవపడ్డాడు. ఆమె నిద్రపోయిన తర్వాత కాళ్లతో గొంతుపై తొక్కి హత్య చేశాడు. అనంతరం గోనె సంచిలో శవంతో పాటు పెద్ద రాళ్లు వేసి మూటగట్టాడు. విషయం బయటకు తెలియకుండా గ్రామానికి చెందిన బోయిన నవీన్(లడ్డు) సాయంతో అర్ధరాత్రి ఆటోలో మృతదేహాన్ని జుంటివాగులో పడవేశాడు. మరునాడు పెద్ద కొడుకు సతీశ్ తమ్ముడికి ఫోన్ చేసి అమ్మతో మాట్లాడించు అంటే తనకు తెలియదని బదులిచ్చాడు. ఎక్కడా ఆచూకీ తెలియక నిలదీయడంతో తానే చంపానని గురువారం రాత్రి అన్నకు చెప్పాడు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు శుక్రవారం శవాన్ని బయటకు తీసి తాండూరు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు వెంకటేశ్‌తో పాటు నవీన్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



ధారూరు: మోమిన్‌కలాన్‌లో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కూతురు అనన్య

తండ్రి కోసం తనయ ఆరాటం

ధారూరు: మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ గెలుపు కోసం ఆయన కూతురు అనన్య అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచే ప్రచారం ప్రారంభించారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని మోమిన్‌కలాన్, మోమిన్‌కుర్దు, రాజాపూర్ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఆరు గ్యారెంటీలపై ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుపై ఓటేసి తన తండ్రిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాములు, సర్పంచ్ పాండునాయక్, ఎంపీటీసీ సభ్యులు బసప్ప, శ్రీనివాస్, నాయకులు మహ్మద్ బాబాఖాన్, రాజేందర్‌రెడ్డి, ఇబ్రహీం, బుజ్జయ్యగౌడ్, నారాయణరెడ్డి, బల్వంత్‌రెడ్డి, మల్లారెడ్డి, మాన్‌సింగ్, బి.అంజయ్య, రాఘవేందర్, ఇనాయతుల్లాఖాన్, రవీందర్, ప్రవీణ్, యాదయ్య, గఫార్, కిషోర్, బాబు మియా, రాజ్ మహ్మద్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి జనసభను సక్సెస్ చేద్దాం



విలేకరులతో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: తాండూరు, పరిగి పట్టణాల్లో శనివారం జరిగే కాంగ్రెస్ పార్టీ విజయభేరి జనసభను విజయవంతం చేద్దామని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాండూరు పట్టణంలోని భద్రేశ్వర చౌక్‌లో మధ్యాహ్నం 2 గంటలకు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రోడ్ షో ఉంటుందని, సాయంత్రం 4గంటలకు పరిగి అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సీఎల్పీ నేత భట్టివిక్రమార్క హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు ఎర్రగడ్డపల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతితో మేలైన దిగుబడి

- వ్యవసాయ శాస్త్రవేత్త సుధారాణి
- పత్తి రైతులకు అవగాహన సదస్సు

పరిగి: అధిక సాంద్రత పత్తిసాగుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాక కేంద్రం తాండూరు ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సయ్యాద్‌పల్లి రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాకకేంద్రం తాండూరు వారి ఆధ్వర్యంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా పత్తి రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పద్ధతిలో సాగుకు తేలికపాటి నేలలు అనుకూలమన్నారు. కొన్ని సంవత్సరాలుగా పత్తి దిగుబడి నిలకడగా ఉందని దీన్ని పెంచాల్సిన అవసరం ఉందని రైతులకు సూచించారు. అధిక సాంద్రతలో యాంత్రీకరణతో పత్తి విత్తుకోవచ్చని దీంతో మొలక మంచిగా వస్తుందన్నారు. పత్తి పంట ఒకే సారి చేతికి వస్తుందని కలుపు సమస్యలు తక్కువగా ఉంటాయన్నారు. పెట్టుబడి సాధారణ పద్ధతికంటే తక్కువగా ఉండటంతో పాటు, చీడపురుగుల వ్యాప్తి తట్టుకునేలా పంట ఉంటుందన్నారు. అనంతరం జిల్లా వ్యవయాధికారి గోపాల్ మాట్లాడుతూ పంట సాగులో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వాణిశ్రీ, రేవతి, రాజేశ్వర్‌రెడ్డి, యమున, ఏడీఏ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పులి కలకలం

- ఆందోళనలో రైతులు
- ఆనవాళ్లు లేవంటున్న అధికారులు



మొరంగపల్లిలో తాగునీటి ప్రదేశాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మోమిన్‌పేట: రోడ్డు దాటుతున్న పులిని చూసిన రైతులు ఆందోళనతో అధికారులకు సమాచారం ఇచ్చారు. గురువారం రాత్రి పొలాలకు వెళ్లిన రైతులు మొరంగపల్లి నుంచి ఎన్కేపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా చూశామని చెప్పడంతో శుక్రవారం అధికారులు తాగునీటి వసతి ప్రదేశాలను పరిశీలించారు. ఎటువంటి ఆనవాళ్లు కన్పించలేదని.. అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు ఆందోళనతో మధ్యాహ్నమే ఇళ్లకు చేరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ అరుణ, ఎఫ్ఎస్‌ఓ ఫరీద్, ఎఫ్‌బీఓ మహేష్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘గులాబీ’ గూటికి ‘ఏనుగు’

ఎన్నికల వేల నేతలు కండువాలు మార్చుతున్నారు. ఎవరు ఎప్పుడు ఏపార్టీలో చేరుతున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. తాజాగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్ది అంజయ్య తన అనచరులలో కలిసి ‘ఏనుగు’ దిగి ‘కారె’క్కారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన వికారాబాద్ బీఎస్పీ ఇన్‌చార్జి అంజయ్య



ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న పెద్ది అంజయ్య తదితరులు

అనంతగిరి: ముచ్చటగా మూడోసారి కారుదే అధికారం కేసీఆర్‌నే సీఎం అని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వంచిన కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్ది అంజయ్య ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనందర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకు ముందు ఆయన పట్టణంలోని ఆలంపల్లి నుంచి అనుచరులతో కలిసి ర్యాలీగా పార్టీ కార్యలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందగా ఇతర పార్టీల ప్రధాన నేతలు సైతం బీఆర్‌ఎస్‌లో చేరుతున్నార్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి ఆనంద్‌ను గెలిపించి గులాబీ జెండా ఎగురవేద్దామన్నారు. జిల్లాలోని అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. తనను నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లవేళలా పాటుపడుతానన్నారు. పార్టీలో చేరిన వారిలో బీఎస్పీ బంట్వారం మండలం అధ్యక్షుడు సయ్యద్ బాబా, నియోజకవర్గ కార్యదర్శి గౌస్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింలు తదితరులు అనుచరులతో కలిసి గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగేందర్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు వడ్ల నందు, పురుషోత్తంరెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అడిగితే పాలమూరు ఖరారు

- తండ్రి దరఖాస్తు చేసుకున్న స్థానంలో తనయుడికి చోటు
- బీజేపీ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నుంచి ఏపీ మిథున్‌రెడ్డికి అవకాశం
- అయోమయంలో అనుచరులు



మిథున్‌రెడ్డి

షాద్‌నగర్: అనుకున్నది ఒక్కటి.. అయినది ఒక్కటి అన్న చందంగా మారింది బీజేపీ యువనేత పరిస్థితి.. మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి షాద్‌నగర్ అసెంబ్లీ బరిలో నిలిచేందుకు తీవ్రంగా యత్నించారు. అనూహ్యంగా అధిష్టానం శుక్రవారం విడుదల చేసిన రెండో లిస్టులో ఒకే ఒక్కడికి పాలమూరు టికెట్ కేటాయించి ప్రకటించింది.

షాద్‌నగర్ అడిగితే పాలమూరు

కొన్ని ఏళ్ల నుంచి ఏపీ మిథున్‌రెడ్డి షాద్‌నగర్‌లో చురుగ్గా పనిచేస్తూ కేడర్ పెంచుకున్నారు. స్థానికుడు కాదనే ఆరోపణలు రావడంతో స్థానికంగా ఇంటిని నిర్మించుకుని ప్రజల తో మమేకమయ్యారు. మహబూబ్‌నగర్ స్థానానికి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, షాద్‌నగర్ నుంచి పోటీ చేసేందుకు మిథున్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. కా గా బీజేపీ అధిష్టానం మాత్రం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నుంచి ఏపీ మిథున్‌రెడ్డిని పేరు ప్రకటించింది. దీంతో షాద్‌నగర్ పార్టీ కేడర్‌లో ఒక్కసారిగా సమీకరణాలు మారిపోయాయి. ఏపీ మిథున్‌రెడ్డికి అనుచరులు అయోమయానికి గురవుతున్నారు. ఇన్నాళ్లు ఆయన వెంట తిరిగిన నేతలు ఎవరికి మద్దతివ్వాలనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. టికెట్ రేసులో ఉన్న మిగిలిన నేతలను కాదని మిథున్‌రెడ్డి వెంట వెళ్లిన నేతల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

టికెట్ కోసం త్రిముఖ పోరు

బీజేపీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు నలుగురు నేతలు పోటీ పడ్డారు. పాలమూరు విష్ణువర్దన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మిథున్‌రెడ్డిలు అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా శ్రమించగా అధిష్టానం మిథున్‌రెడ్డికి మహబూబ్‌నగర్ అసెంబ్లీ కేటాయించారు. దీంతో ప్రస్తుతం ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. అందులో పాలమూరు విష్ణువర్దన్‌రెడ్డి, అందెబాబయ్య పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పార్టీ పెద్దలు షాద్‌నగర్ అసెంబ్లీ బీజేపీ ఎవరికి టికెట్ కేటాయిస్తారో దాని పై ఉత్కంఠ నెలకొంది.

అధికారం రాగానే ‘ఆరు గ్యారెంటీ’

కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థి భీమ్ భరత్



మాట్లాడుతున్న భీమ్ భరత్

మొయినాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పెట్టిన పథకాలన్నీ గ్యారెంటీగా అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థి భీమ్ భరత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భీమ్ భరత్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ.. పదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయని బీఆర్‌ఎస్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను కాపీకొట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నా బలం.. బలగం మీరే.. కంఠంలో ప్రాణమున్నంత వరకు ప్రజా సేవకే అంకితమన్నారు. అధికార బీఆర్‌ఎస్ ఎన్ని ఇబ్బందులు పెడుతున్నా నాటి నుంచి పార్టీని కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్న నాయకులకు, కార్యకర్తలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో నేటికీ డబుల్ బెడ్రూం ఇళ్ల జాడే లేదన్నారు. అనంతరం సతీశ్, దర్శన్ మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ అమలుకు ముందే సంక్షేమ పథకాలు విడుదల చేయాలంటే అధికార పార్టీ మాత్రం దాన్ని వక్రీకరించి ప్రచారం చేసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో భీమ్‌భరత్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని సోనియాగాం.దీకి బహుమతిగా ఇద్దామన్నారు. ఇందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, రాంచంద్రారెడ్డి, కేబుల్ రాజు, గణేశ్ గౌడ్, మక్బుల్, రాజేందర్, రమేశ్, మల్లారెడ్డి, రాంరెడ్డి, ఆంజనేయులుగౌడ్, మహేందర్ ముదిరాజ్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి

శంకర్‌పల్లి: తన భర్తను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజకవర్గ అభివృద్ధి చేసి చూపిస్తాడని భీమ్‌భరత్ సతీమణి జ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని రావులపల్లి కలాన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం చేకూరుతుందన్నారు. నగరానికి ఆనుకుని ఉన్న చేవెళ్ల పదేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. హస్తం గుర్తుకు ఓటేసి అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రావులపల్లి కలాన్ అధ్యక్షుడు సురేందర్, వార్డు సభ్యులు మన్నె శ్రీనివాస్, బి.వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, అంజద్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రావులపల్లి కలాన్‌లో ప్రచారం చేస్తున్న జ్యోతి

కారు టైరు పేలి..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: కారుటైరు పేలి ఓ సాఫ్ట్‌వేర్ దుర్మరణం చెందాడు. ఈ దుర్ఘటన శుక్రవారం సాయంత్రం ఓఆర్‌ఆర్‌పై చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన ప్రకారం.. మండల మరళీకృష్ణ ప్రసాద్‌రావు సాఫ్ట్‌వేర్. ఆయన తండ్రి, భార్య, కుమారుడితో కలిసి తన కారులో ఓఆర్‌ఆర్ మీదుగా చందానగర్‌కు వెళ్తున్నారు. బొంగ్లూర్ ఎగ్జిట్ 12కి సమీపంలో కారు టైరు పేలడంతో కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మురళీ కృష్ణ ప్రసాద్‌రావు (51) అక్కడిక్కడే మరణించాడు. మిగిలిన వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాంగ్రెస్ కార్యకర్త నుంచి రూ.5 లక్షలు స్వాధీనం

- నగదు సీజ్.. కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని బొంరాస్‌పేట మండలం వడిచర్ల శివారులో రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన డాక్యానాయక్ వద్ద రూ.5 లక్షలు పట్టుకున్నామని స్పష్టంచేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నగదు తీసుకెళ్తున్న అతన్ని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. మూడు తండాలకు చెందిన బీఆర్‌ఎస్ సర్పంచులను కొనుగోలు చేసేందుకు ఈ డబ్బు తీసుకెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు గిరిజన నాయకులను ప్రలోభాలకు గురి చేసి కాంగ్రెస్‌లోకి రావాలని డాక్యానాయక్ ఒత్తిడి చేసినట్లు తెలుస్తోందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు డబ్బును సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లోని 18 గ్రామాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం భద్రతా బలగాలు వచ్చాయని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నుంచి ఇప్పటి వరకు రూ.55 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐ రాములు పాల్గొన్నారు.

రూ.2.50లక్షల పట్టివేత

తాండూరు టౌన్: వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.2.50లక్షల నగదు సీజ్ చేశారు. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఇందిరాచౌక్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీనివాస్ వద్ద రూ.2.50లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇట్టి నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపక పోవడంతో నగదును సీజ్ చేసి స్క్రీనింగ్ కమిటీ సభ్యులకు అందజేసినట్లు సీఐ తెలిపారు.